క్లుప్తంగా

నందెన్న ఉత్సవాలు ప్రారంభం



వెంగాపురంలో ఏర్పాటుచేసిన నందెన్న

బలిజిపేట: మండలంలో నందెన్న ఉత్సవాలను ప్రారంభించారు. అందులో భాగంగా వెంగాపురంలో శివపార్వతుల విగ్రహాలను ఏర్పాటుచేశారు. స్వామివారి సన్నిధిలో దీపాలు ఏర్పాటుచేసి పండ్ల తోరణాలను వేలాడదీసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు జరిపించారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలోని గ్రామంలో భక్తులు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహ స్వామికి తులసీదళార్చన



తులసీదళాల అర్చనలో లక్ష్మీనృసింహస్వామి

సీతానగరం: స్థానిక సువర్ణముఖి నది ఒడ్డున ఉన్న వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో వెలసిన లక్ష్మీనృసింహస్వామిని తులశీదళాలతో గురువారం అర్చించారు. అలాగే భక్తులతో స్వామివారికి ముడుపుల పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ స్వామివారి దర్శనానికి భక్తులు ప్రతి గురువారం తరలివస్తారని, ఈ సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ముడుపుల పూజలు, అభిషేకాలు చేసినట్లు తెలిపారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచాలి



పలగరలో ప్రాథమిక పాఠశాలను పర్యవేక్షిస్తున్న ఎంఈఓ సామల

బలిజిపేట: విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచాలని, అందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని, ప్రాథమిక విద్య వారి భవిష్యత్‌కు పునాది అని ఎంఈఓ-1సామల సింహాచలం అన్నారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని పలగర పంచాయతీ గుడివాడకాలనీలో గల ప్రాథమిక పాఠశాలను ఆయన గురువారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నోట్ పుస్తకాలు, వర్క్‌బుక్‌లు పరిశీలించారు. బోర్డుపై అక్షరాలు రాసి విద్యార్థులతో చదివించారు. అకడమిక్ పుస్తకాల ప్రకారం వారిలో సామర్థ్యాలు పెరిగేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తడిసిన మొక్కజొన్న



బొడ్డ సామంతవలస సమీపంలో తడిసిన మొక్కజొన్న కంకెలను రహదారిపై ఆరబెట్టిన దృశ్యం

మక్కువ: ఆరుగాలం శ్రమించి, పండించిన పంట చేతికివచ్చే సమయంలో అకాల వర్షాలకు తడిచిపోవడంతో రైతన్నలు లబోదిబోమంటున్నారు. ఈ మేరకు మక్కువ మండలంలోని పలు గ్రామాల్లో రైతులు సాగుచేసిన మొక్కజొన్న పంట పక్వానికి చేరుకోగా...గడిచిన వారంరోజులుగా రైతులు మొక్కజొన్న కండెలను వేరుచేసి, కళ్లాలు, రహదారులు, కొండలపై ఆరబెట్టారు. గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి మొక్కజొన్న కండెలు తడిసిపోయాయి. తడిచిన మొక్కజొన్న కండెలను కొంతమంది రైతులు ట్రాక్టర్లపై ఇతర ప్రాంతానికి తరలిస్తుండగా, మరికొంతమంది రహదారులపై ఆరబెట్టే పనుల్లో నిమగ్నమయ్యారు.



గదబ బొడ్డవలస వద్ద గోతులతో ఉన్న మామిడిపల్లి రోడ్డు

భయం భయంగా ప్రయాణం

- ప్రమాద భరితంగా మామిడిపల్లి రోడ్డు
- గాయాలపాలవుతున్న వాహన చోదకులు
- పట్టించుకోని అధికారులు

సాలూరు రూరల్: ఇటీవల కురిసిన వర్షాలకు సాలూరు పట్టణం నుంచి మామిడిపల్లి గ్రామానికి వెళ్లే రహదారిపై పెద్దపెద్ద గోతులు ఏర్పడడంతో ప్రమాదభరితంగా మారింది. సాలూరు నుంచి మామిడిపల్లి వరకు గల 10 కిలోమీటర్ల మేర రహదారిలో ప్రతి పావుకిలోమీటరుకు పెద్ద గొయ్యి ఉండడంతో ఆ రోడ్డుపై ప్రయాణం వాహన చోదకులకు ఇబ్బందికరంగా మారింది. రాత్రిపూట చీకటిలో గుంతలు కనిపించక ద్విచక్రవాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. నిత్యం రాకపోకలతో రద్దీగా ఉండే ఈ రహదారి బంగారమ్మపేట, బొడ్డవలస గ్రామాల మధ్యలో ప్రమాదభరితంగా ఉన్న పెద్ద గోతులను ఇటీవల సాలూరు రూరల్ పోలీసులు రాయిబుగ్గి వేసి చదును చేయించారు. ఇంకా రోడ్డు పొడవునా ఉన్న గోతులకు ఆర్అండ్‌బీ అధికారులు మరమ్మతులు చేయాల్సి ఉంది ఇటీవల ఆ రహదారిపై ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తూ ఇద్దరు యువకులు ప్రమాదవశాత్తు గోతిలో పడి గాయాలపాలయ్యారు. అంతేకాకుండా నిత్యం రాత్రి పూట ద్విచక్రవాహన చోదకులు గోతుల్లో పడిపోతూ గాయాలపాలవుతున్నట్లు స్థానిక ప్రజలు చెబుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



రోడ్డు మధ్యలో పెద్దగొయ్యి

వంతెన సమస్య పట్టించుకోండి

సాలూరు మండలంలోని సారిక పంచాయతీ సాంపిగాం గ్రామానికి కొండవాగుపై మధ్యలో నిలిచిపోయిన వంతెన నిర్మాణం పూర్తిచేయాలని ఈ విషయంలో ఎన్నికల సమయంలో హామీలు గుప్పించిన మంత్రి సంధ్యారాణి పట్టించుకోవాలని ఆ గ్రామ ప్రజలు వేడుకుంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు చదునుగా ఉన్న గెడ్డలో రాళ్లు, రప్పలు తేలిపోయి కనీసం నడవడానికి కూడా ఇబ్బందికరంగా ఉంది. ద్విచక్రవాహనాలు వెళ్లే పరిస్థితి లేదు. గెడ్డ దాటాలంటే గ్రామస్తులు పలు ఇబ్బందులకు గురి కావాల్సి వస్తోంది. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం హయాంలో సాలూరు మండలంలో పలు వంతెనల నిర్మాణానికి మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర నిధులు మంజూరు చేయించారు. ఆ సమయంలో కందుల పదం వంతెన పూర్తికాగా సాంపిగాం గెడ్డపై వంతెన పనులు కొంతవరకు జరిగాయి. అలాగే శివరాంపురం, దండిగాం గెడ్డలపై వంతెనలకు నిధులు సిద్ధంగా ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఇబ్బందులకు గురయ్యామని, ఇప్పటికైనా సాంపిగాం వంతెన నిర్మాణం త్వరగా ప్రారంభించాలని గ్రామస్తులు మంత్రి సంధ్యారాణిని కోరుతున్నారు.

రద్దీ ప్రదేశాల్లో మద్యంషాపులు తొలగించాలి

బలిజిపేట: ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా, నిరంతరం రద్దీగా ఉండే ప్రదేశాల్లో ఏర్పాటుచేసిన మద్యం దుకాణాలను తొలగించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం మండల కమిటీ సభ్యులు తహసీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్‌లో వినతి పత్రాలను అందించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు జి.సత్యనారాయణ, వై.మన్మథరావులు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా బలిజిపేటలో మద్యం దుకాణాలను ఏర్పాటుచేసినా అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. దీనివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గుడి, బడి రెండింటికి సమీపంలో షాపులను ఏర్పాటుచేయడం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధమన్నారు. నిరంతరం విద్యార్థులు, మహిళలు ఎక్కువగా తిరిగే ప్రదేశాలలో వాటిని ఏర్పాటుచేయడం వల్ల అటువైపు మహిళలు వచ్చేందుకు అవకాశాలు లేకుండా పోతున్నాయని, ముఖ్యంగా విద్యార్థులు వ్యసనాలకు అలవాటు పడే ఆస్కారం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ షాపులను తొలగించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బి.భానుమూర్తి, అప్పలస్వామి, కృష్ణ సన్యాశి, తిరుపతిరావు, ఎ.సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



ఆర్ఐకి వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

దోమల నివారణ, మంచినీరు సరఫరాకు ప్రాధాన్యం



లచ్చయ్యపేటలో దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్న సర్పంచ్ కృష్ణ



పెదభోగిలిలో పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయిస్తున్న దృశ్యం

సీతానగరం: మండలంలోని పంచాయతీల పాలకులు గ్రామాల్లో దోమల నివారణ, మంచినీరు సరఫరా చేయడానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. అన్నిగ్రామాల్లో పండగలు జరగడం, వర్షాలు కురవడం, పిచ్చి మొక్కలు రావడంతో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్న ఉన్నతాధికారుల సూచనల మేరకు పనులు జరుగుతున్నాయి.ఈ క్రమంలో గ్రామాల్లో దశాబ్దాల క్రితం నిర్మించిన మంచినీరు పైప్‌లైన్లు శిథిల మవడంతో తాగాల్సిన నీరు వృథాగా గుంతల్లో చేరడం వల్ల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన పాలకులు కాలువల నిర్మాణం, పైపులైన్ల మరమ్మతులు, కాలువల్లో పూడిక తీత, దోమల నివారణ మందు పిచికారీ చేయించే పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ మేరకు గురువారం లచ్చయ్యపేట, బగ్గందొరవలస, బల్లకృష్ణాపురం, చినభోగిలి, కేఎస్‌పురం, పెదభోగిలి, సూరంపేట, జానుమల్లు వలస తదితర గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహించారు.

తూతూ మంత్రంగా పల్లెపండగ

- పాతపనులకే శంకుస్థాపనలు
- ప్రజాప్రతినిధులకు దక్కని గౌరవం

సాలూరు రూరల్: మండలంలోని పారన్నవలస గ్రామంలో శుక్రవారం జరిగిన పల్లెపండగ కార్యక్రమం తూతూమంత్రంగా సాగింది. దీనికి అధికార పార్టీ కార్యకర్తలే ప్రజాప్రతినిధులుగా వ్యవహరించిన తీరు కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు ఎంత విలువ ఇస్తోందో అర్థమవుతోంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో పల్లెపండగ కార్యక్రమం నిర్వహించాల్సి ఉండగా కనీసం పారన్నవలస సర్పంచ్ చొంగలి లక్ష్మణ రాకముందే టీడీపీ నాయకులు కార్యకర్తలతో భూమిపూజచేసి పల్లెపండగ ముగించారు. ఈ విషయంలో సర్పంచ్ లక్ష్మణ అధికారులను నిలదీసినప్పటికి వారు పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో అధికారులు అధికారపార్టీ నాయకుల తొత్తులుగా వ్యవహరిస్తున్నారన్నది స్పష్టమవుతోందని పలువురు గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు విమర్శించారు.

రూ.3కోట్లతో సీసీ రోడ్డుకు శంకుస్థాపన

గత ప్రభుత్వంలో మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర మంజూరు చేసిన రూ.3 కోట్లతో బంగారమ్మ గుడినుంచి శివరాంపురం బీటీ రోడ్డు వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి టీడీపీ నాయకులు గురువారం శంకుస్థాపన చేశారు. పల్లెపండగలో దాదాపు ప్రతిగ్రామ పంచాయతీలో గత ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో భూమిపూజలు నిర్వహించడం కనిపిస్తోంది.



మక్కువ: పల్లెపండగ కార్యక్రమంలో సర్పంచ్ లేకుండానే భూమిపూజ

అధకారులతీరుపై ఫిర్యాదు

మండల అధికారుల తీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేస్తాను. సర్పంచ్ వచ్చేలోపే టీడీపీ కార్యకర్తలతో పల్లెపండగ ముగించడం విచారకరం. ఇలాగే అధికారుల తీరు ఉంటే ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు విలువలేకుండా పోతుంది. కూటమి ప్రభుత్వంలో ఇంతవరకు ఒక్క రూపాయి కూడా అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయలేదు. గత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వంలో మంజూరైన నిధులతోనే కూటమి నేతలు పల్లెపండగ నిర్వహిస్తున్నారు.

చొంగలి లక్ష్మణ, సర్పంచ్ పారన్నవలస

స్వచ్ఛసుందరంగా పార్వతీపురం



మున్సిపల్ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: స్వచ్ఛ సుందరంగా పార్వతీపురం పట్టణాన్ని తీర్చిదిద్దాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో స్వచ్ఛసుందర పార్వతీపురంపై మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డంపింగ్‌యార్డు సమస్య తలెత్తకుండా తడి చెత్త, పొడి చెత్తను వేరుచేసి సేకరించి, తద్వారా క్లీన్ సిటీ చేయాలని సూచించారు. ప్లాస్టిక్ సంచులను నిషేధిస్తూ, విక్రయించి, వినియోగించే షాపు యాజమాన్యాలతో చర్చించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని చెప్పారు. పట్టణంలోని పార్కులను సుందరంగా తీర్చిదిద్దాలని కోరారు. స్వచ్ఛతపై కరపత్రాలను ముద్రించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ సన్యాసిరావు, ఈఈ వంశీకృష్ణ, డీఈఈ కిరణ్ కుమార్, జట్టు ఆశ్రమం చైర్మన్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేకంగా నట్టల నివారణ వ్యాక్సిన్



జీవాలకు వ్యాక్సిన్ వేస్తున్న సిబ్బంది

బలిజిపేట: గొర్రెలు, మేకల రక్షణకు నట్టల నివారణ వ్యాక్సిన్ ఎంతో రక్షణ ఇస్తుంది. ఏలికపాములు, జటగలు, బద్దెపురుగులు కడుపులో చేరడం వల్ల గొర్రెలు, మేకలు ఎక్కువగా మృతువాత పడుతుంటాయి. దీనిని నివారించడానికి సీజనల్‌గా ఈ సమయంలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తారు. అందులో భాగంగా బలిజిపేట మండలంలో ఈనెలాఖరు వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి జీవాలకు నట్టల నివారణ మందును పంపిణీ చేయనున్నట్లు మండల పశువైద్యాధికారి తెలిపారు. ఈ మేరనకు సచివాలయాల వారీగా పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్‌లు పశువులకు నట్టల నివారణ టీకాలు వేస్తున్నారు.

ప్రత్యేక డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకోవాలి:

నట్టల నివారణ నిమిత్తం ప్రత్యేక డ్రైవ్‌లు ఏర్పాటుచేశాం. ఈ నెలాఖరు వరకు నట్టల నివారణ మందును వేయనున్నాం. దీనిని సద్వినియోగం చేసుకోవాలి. పశుసంవర్ధకశాఖ సిబ్బంది అన్ని ప్రాంతాలకు వచ్చి మందు పంపిణీ చేస్తారు.

గణేష్, మండల పశువైద్యాధికారి, బలిజిపేట

ఘనంగా అయ్యప్పస్వామి పూజ

మక్కువ: స్థానిక భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయ ప్రాంగణంలో గల అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం రాత్రి అయ్యప్పస్వామి మాల ధరించిన భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. వేదపండితుడు ఆరవెల్లి విజయ్‌కుమార్‌శర్మ స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గురుస్వామి కాళహస్తి శ్రీనివాసరావు సమక్షంలో, అయ్యప్ప భక్తులు భజన పాటలు పాడారు. పలు ప్రాంతాలనుంచి భక్తులు ఆలయానికి చేరుకుని అయ్యప్పస్వామి పూజలో పాల్గొన్నారు.



మక్కువలోని అయ్యప్ప స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సూపర్ సిక్స్ అమలు చేయాలి

- మండల సమావేశంలో కోరిన సభ్యులు



మాట్లాడుతున్న ఎంపీపీ బి. రమణమ్మ

సీతానగరం: రాష్ట్రప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చి, నిలిచిపోయిన సంక్షేమ పథకాలను అమలు చేయాలని పలువురు మండల పరిషత్ సభ్యులు కోరారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ బి.రమణమ్మ అధ్యక్షతన గురువారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల్లో భాగంగా సూపర్ సిక్స్ అంశాలపై సభ్యులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంపై అధికారులను నిలదీశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. అలాగే గ్రామాల్లో విద్యుత్ శాఖాపరమైన సమస్యలను పరిష్కరించడం లేదని విద్యుత్‌శాఖ ఏఈ జగన్మోహనరావును నిలదీశారు. దీనికి ఏఈ జగన్మోహన్ రావు మాట్లాడుతూ సమస్య ఉంటే ఫోన్ ద్వారాలేదా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, ఆర్ఐ ఎన్. శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికార సిబ్బంది పాల్గొన్నారు.

నేలకొరిగిన వరిచేను



వెంగళరాయపురం సమీపంలో నేలకొరిగిన చేను

బలిజిపేట: తుఫాన్ ప్రభావంతో గురువారం మధ్యాహ్నం కురిసిన చిరుజల్లులు, వీచిన ఈదురుగాలుల ప్రభావంతో వెన్నుతో ఉన్న వరిచేను నేలకొరిగింది. పంటపొలాలను చూసేందుకు వచ్చిన రైతులు నేలకొరిగిన చేనును చూసి లబోదిబోమంటున్నారు. మరికొద్ది రోజుల్లో కోతకు సిద్ధమవుతున్న పంట గింజ బరువు వల్ల దుబ్బు నేలకొరిగిందని దీనిని ఏవిధంగా తిరిగి సరిచేయగలమని వాపోతున్నారు. ఈ ప్రాంతంలో సుమారు 10ఎకరాల విస్తీర్ణంలో పంట నేలకొరిందని రైతులు తెలిపారు. దీనిపై వ్యవసాయశాఖ అధికారులకు తెలియపరిచి వారి సూచనలు, సలహాలు తీసుకోవాల్సి ఉంటుందని అందుకు వారు సహకరించాలని రైతులు కోరుతున్నారు.

ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయాలి

- సీపీఎం డిమాండ్

మక్కువ: ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యులు వి.ఇందిర, ఎన్.వై.నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని దుగ్గేరు గ్రామంలో సీపీఎం శాఖ మహాసభల సందర్భంగా పార్టీజెండాను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన ప్రాంతమైన దుగ్గేరు గ్రామంలో పీహెచ్‌సీని నిర్మించి, మక్కువ, సాలూరు మండలాలకు చెందిన గిరిశిఖర గ్రామాల గిరిజనులకు వైద్యం సకాలంలో అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే, ఆరు గ్యారంటీలను అమలుచేస్తామని, ప్రజలకు హామీ ఇచ్చినప్పటికీ అమలుచేయడంలేదని విమర్శించారు. అలాగే నిత్యావసరాల ధరలు అదుపు చేస్తామని, చెప్పినప్పటికీ ఆ పరిస్థితి ప్రస్తుతం లేదన్నారు. నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.లక్ష్మణ, కె.ఆనంద్, కె.శ్రీను, గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.



దుగ్గేరులో సీపీఎం జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం

క్రమశిక్షణతో కూడిన విద్యను నేర్చుకోవాలి

మక్కువ: క్రమశిక్షణతో కూడిన విద్యను నేర్చుకోవాలని పార్వతీపురం ఐటీడీఏ పీవో అసుతోష్ శ్రీవాత్సవ విద్యార్థులకు సూచించారు. ఈ మేరకు మండలంలోని పనసభద్రలో గల ఏకలవ్య ఆదర్శ వసతి పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా వంటగదిని తనిఖీ చేసి ఆహార నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. పీఓతోపాటు గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీ వాస్తవ

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పార్వతీపురంటౌన్: విద్యుత్ సరఫరాకు శుక్రవారం అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఈఈ గోపాలరావు నాయుడు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 11 కేవీ బెలగాం ఫీడర్ ట్రీ కటింగ్ చేయడం నిమిత్తం పవర్ సప్లై ఉండదని పేర్కొన్నారు. గూడ్స్‌షెడ్ రోడ్, సౌందర్య థియేటర్ రోడ్డు, శత్రుచర్ల రియల్ ఎస్టేట్ రోడ్డు, ఎస్ఎన్‌పీ కాలనీ, రిక్షా పుల్లర్స్ కాలనీ, జనశక్తి కాలనీ, వివేక్‌కాలనీ, చర్చి వీధి వైకేఎం కాలనీ, డీవీఎం స్కూల్ అగ్రహారం, వీధి తదితర కాలనీలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.